# చివరి ఆయకట్టు రైతుల కష్టాలు

- అశ్వరావుపల్లి కాల్వ ద్వారా అందని సాగునీరు
- రిజర్వాయర్ నుంచి కాల్వ నిర్మాణ పనుల్లో జాప్యం
- రఘునాథపల్లి, లింగాలఘనపురం మండలాల్లో ఎండిన పొలాలు



బండ్లగూడెంలో ఎండిపోయిన రైతు ఎలేందర్‌రెడ్డికు చెందిన వరి పొలం

*కళ్ల ముందే వరి పొలాలు ఎండిపోయి.. రైతులు ఆవేదన చెందుతున్నారు. రఘునాథ పల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ కాల్వ నిర్మాణ పనులు జాప్యం కావడంతో పొలాలు ఎండిపోయాయి. రిజర్వాయర్ నుంచి కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ లింగాలఘనపురం మండలంలోని చివరి ఆయకట్టుకు అందడంలేదు. దీంతో పంటలు ఎండి రైతులు పెట్టుబడి కూడా నష్టపోయారు.*

లింగాలఘనపురం, మార్చి 30: మండలంలో వరి పంటను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. పొలాలకు నీరు అందించేందుకు అధికారులు అశ్వరావుపల్లి కాల్వ ద్వారా నీటిని విడుదల చేశారు. మొదట భూములు ఉన్న రైతులు ఈ నీటిని మళ్లించుకుంటున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరడంలేదు. అశ్వరావుపల్లి కాల్వ ద్వారా లింగాలఘనపురం, మాణిక్యపురం, నాగారం, తదితర గ్రామాలకు నీటిని అందిస్తున్నారు. రైతులు కాపలా ఉండి నీటిని పొలాలు తరలిస్తున్నారు. నీరు పొలాలకు చేరిందని వెళ్లగానే పక్కనున్న రైతులు నీటిని మళ్లించుకుంటున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు నీళ్లు అందడంలేదు. రైతులు పోలీసులు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు.

### కాల్వ నీళ్లను మళ్లించుకుంటున్నరు

నాకున్న రెండెకరాల్లో వరి వేశాను. నా వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటాయి. పక్క రైతు బోరు నుంచి నీళ్లను అడపాదడపా తీసుకొచ్చి అందిస్తున్నా. అశ్వరావుపల్లి కాల్వ ద్వారా నేరుగా నీళ్లు రావాల్సి ఉండగా, మాణిక్యపురం, నాగారం, బంజరబావి, బెస్తబావి రైతులు అడ్డు కట్టలు వేసి తరలించుకుపోతున్నారు. చివరి ఆయకట్టులో ఉన్న మా పొలాలకు నీరు అందడంలేదు. దీనిపై ఇరిగేషన్, పోలీసు శాఖకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు.

*– పోరెడ్డి ఎలేందర్‌రెడ్డి, రైతు, బండ్లగూడెం*

## కాల్వలో ఇరువైపులా చెట్లు

### సీసీ పాడై కూలిపోయే ప్రమాదం

జనగామ రూరల్, మార్చి 30: మండలంలోని సిద్దెంకి గ్రామంలోని గోదావరి కాల్వలో ఇరువైపుల చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో సీసీ దెబ్బతిని కాల్వ ధ్వంసమవుతుందని రైతులు అంటున్నారు. ఆకులు రాల్చడంతో నిండి కాల్వ మూసుకుపోయింది. అధికారులు స్పందించి ఈ చెట్లు, చెత్త తొలగించి, గోదావరి జలాలు విడుదల చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.



సిద్దెంకిలో గోదావరి కాల్వలో పెరిగిన చెట్లు



డాక్టరేట్ పొందిన కనకరాజ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

## కనకరాజుకు మాజీ సర్పంచ్ సన్మానం

బచ్చన్నపేట, మార్చి 30 : మండలంలోని చిన్నరామన్‌చర్లకు చెందిన కళాకారుడు కనకరాజును గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, న్యాయవాది సిద్దూయాదవ్ ఆదివారం ఘనంగా సన్మానించారు. కనకరాజ్ కళారంగంలో రాణించి ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలో జరిగిన యునైటెడ్ నేషన్, ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ అందించిన గౌరవ డాక్టరేట్ బిరుదు అందుకున్నట్లు తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్గ సిద్దులు, నక్క కనకయ్య, మల్లేశం, అశోక్, సిద్దిరాములు, నర్సింహులు, రవి, రాజ మల్లయ్య, సురేశ్, భానుందర్, రాజు, అయిలయ్య, బాలరాజు, రమేశ్, సిద్దులు, మల్లయ్య, రాములు, షబ్బీర్ పాల్గొన్నారు.

గంగమ్మ నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న యాదవులు

## గంగమ్మ తల్లికి యాదవుల పూజలు

దేవరుప్పుల, మార్చి 30: మండల కేంద్రానికి చెందిన కొత్తవాడ యాదవ కులస్తులు ఉగాది పర్వదినం సందర్భంగా కుల దైవమైన గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కులపెద్దలు గంపను అలంకరించి నైవేద్యంతో సంప్రదాయ వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరి పూజలు చేశారు. ఉగాది పచ్చడి తయారు చేసి నైవేద్యం సమర్పించారు. కుల పెద్దలు కాసాని సత్యనారాయణ, కాసిని రాజమల్లు నిర్వహించారు. రాసాల భయ్యాలు, జక్కుల గంగరాజు, పులిగిల్ల వెంకన్న, కాసాని బుచ్చయ్య, సోమయ్య, బుచ్చిరాములు, రాసాల చంద్రయ్య, పులిగిల్ల కొండయ్య,మల్లయ్య, అయిలయ్య ఉన్నారు.

# తలాపున రిజర్వాయర్ ఉన్నా..

- నీటి విడుదలలో జాప్యం
- రఘునాథపల్లి మండలంలో ఎండిపోయిన వరి పంట

నిడిగొండలో ఎండిపోయిన వరి పంట

మంగళిబండ తండాలో ఎండిన వరి పంట

రఘునాథపల్లి: మండలంలోని రైతులకు తలాపున రిజర్వాయర్ ఉన్నప్పటికీ సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలనలో మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు జలకళ ఉట్టిపడేది. వేసవి ప్రారంభంలోనే చెరువులు, కుంటలు గోదావరి జలాలతో నింపేవారు. దీంతో బీడు భూములు సైతం సాగులోకి వచ్చి పంటలు పండాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పరిస్థితులు మారిపోయాయి. అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి ప్రభుత్వం సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో చెరువుల్లో నీరు లేక ఆయా గ్రామాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పొలాలు కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. కాగా, మండలంలో యాసంగి సీజన్‌లో 16వేల ఎకరాల్లో వరి, 500ఎకరాల్లో మక్కజొన్న సాగుచేసినట్లు వ్యవసాధికారులు తెలిపారు. గత ఏడాది 18 ఎకరాల్లో వరిసాగు కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు నింపింది. బోర్లలోనూ నీరు పుష్కలంగా పెరిగింది. రైతులు పంటలు పండించి అధిక దిగుబడులు సాధించారు. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో వరి సాగు తగ్గినప్పటికీ సాగునీరు అందక పొలాలు ఎండిపోయి తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కాల్వ పనుల్లో ఆలస్యం

అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి గోవర్ధనగిరి కోతులకుంట నింపి సాగునీరు అందించేందుకు కాల్వ నిర్మాణ పనులు జాప్యం కావడంతో పంటలు ఎండిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఎండిపోయి అప్పులే మిగిలాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు కాల్వ పనులు పూర్తి చేయించి కోతులకుంట నింపి రైతులను ఆదుకోవాలి.

*– వల్లపు కుమారస్వామి, రైతు, గోవర్ధనగిరి*

# మామిడితోట కోసం భగీరథ యత్నం

- నీళ్లు కొనుగోలు చేస్తున్న రైతు
- వారానికి రూ.6 వేలు చెల్లిస్తున్న వైనం

జనగామ రూరల్, మార్చి 30 : గోదావరిలో నీళ్లున్నా దేవాదుల రిజర్వాయర్ల ద్వారా చెరువులు, కుంటలకు సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సాగునీరందక ఓ వైపు పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు మామిడితోటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. సిద్దెంకి గ్రామానికి చెందిన రైతు ముస్త్యాల మల్లయ్య తనకున్న రెండెకరాల మామిడితోటను రక్షించుకునేందుకు నీటిని కొనుగోలు చేస్తున్నాడు. బోరులో నీరు అడుగంటడంతో పూతకొచ్చి కాతదశలో ఉన్న మామిడిని కాపాడుకునేందుకు ఆటోలో వాటర్ ట్యాంకు పెట్టి నీటిని కొనుగోలు చేసి పైపుల ద్వారా చెట్లకు పడుతున్నాడు. వారానికి రూ.6వేలు ఖర్చు చేసి రెండు రోజులకోసారి నీటిని అందిస్తున్నట్లు రైతు ముస్త్యాల మల్లయ్య ఆవేదనగా చెప్పాడు.

సిద్దెంకిలో ఆటోలో ట్యాంకర్‌లో తెచ్చిన నీటిని మామిడితోటకు పడుతున్న రైతు ముస్త్యాల మల్లయ్య



కడవెండి వానకొండయ్య జాతరలో భక్తులు, వాహనాలు

## ముగిసిన వానకొండయ్య జాతర

దేవరుప్పుల, మార్చి 30: కడవెండి శివారు వానకొండయ్య గుట్టపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి జాతర కాముని పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణంతో మొదలు కాగా ఆదివారం ఉగాది రోజు ముగిసింది. చివరి రోజు భక్తులు వేలాదిగా తరలివచ్చి ఉగాది రోజున లక్ష్మీనర్సింహస్వామి దర్శనం చేసుకున్నారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఈ జాతరకు అన్ని వర్గాల ప్రజలు కుటుంబాలతో హాజరవుతారు. ఈ ప్రాంత రైతులకు వానకొండయ్య ఇలవేల్పు కాగా ఏటా జాతరకు వచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. ఆలయం గుట్టపై ఉండగా వంశపారంపర్య అర్చకుడు బీట్కూరు సంపత్ కుమారాచార్యులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఏర్పాట్లు చేయగా స్వామివారు ఉగాది పచ్చడి తాగడంతో ఈ జాతర ముగిసినట్టు ప్రకటిస్తారు. జాతర ముగిసినా స్వామి దర్శనాలు రోజూ ఉంటాయి.

## కారు ఢీకొని వృద్ధుడు మృతి

మారయ్య (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 30 : కారు ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందినట్లు సీఐ జీ వేణు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన బాస్కుల మారయ్య(69) శనివారం సుమా రు రాత్రి 9గంటలకు జాతీయ రహదారి దాటుతున్నాడని, హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న పర్వతగిరికి చెందిన శ్రవణ్ కారుతో ఢీకొనడంతో మారయ్యకు తీవ్ర గాయాలైనట్లు పేర్కొన్నారు. చికిత్స కోసం 108లో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## ముస్లింలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

జనగామ చౌరస్తా, మార్చి 30: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా జిల్లాలోని ముస్లిలందరికీ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు ముస్లింలు కఠినమైన నియమ నిబంధనలు, భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు కొనసాగిస్తారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సుఖ, సంతోషాలతో రంజాన్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ప్రతిఒకరికీ అల్లా దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కాంక్షించారు.

# గ్రూప్-1లో బచ్చన్నపేట వాసికి 272వ ర్యాంకు

బచ్చన్నపేట, మార్చి 30 : గ్రూపు-1 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 467 మార్కులతో 272ర్యాంకు, జోనల్ స్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు. ఇటీవల గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్రంలో 8వ ర్యాంకు సాధించాడు. వ్యవసాయ చేసే చిమ్ముల మల్లారెడ్డి, అరుణ దంపతులకు జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచి బాగా చదివేవాడు. ఇప్పటికే పలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆయన గ్రూపు-1లోనూ మెరుగైన ర్యాంకు సాధించాడు. అతడిని గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందించారు. సివిల్స్ సాధించాలన్నదే తన చిరకాల కోరిక అని, గ్రూప్స్ ద్వారా ఉన్నతమైన ఉద్యోగం పొందాలనే కృషి, పట్టుదలతో చదివినట్లు తెలిపాడు. రెండున్నరేళ్లుగా గ్రూప్-1కు కష్టపడి ప్రిపేర్ అయినట్లు తెలిపాడు. తన సోదరి నవిత గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తోందని చెప్పాడు.

కుటుంబ సభ్యులతో రాజశేఖర్‌రెడ్డి

## నర్మెటలో జడకొప్పులాట

నర్మెట, మార్చి 30: సంప్రదాయాలకు నిలయంగా మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న మర్రి చెట్టు వద్ద జడకొప్పులాట ఏటా ఉగాది పర్వదినం రోజు ఆడతారు. ఈ సందర్భంగా 22 రంధ్రాలు ఉన్న చెక్కకు తాళ్లను వేళాడతీసి చేతిలో పట్టుకొని 22 మంది యువకులు కర్రలతో కోలాటం ఆడుతూ తాడును జడకొప్పుగా అల్లి తిరిగి అదే ఆటతో ఆ జడను విడదీయడం విశేషం. 30 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న ఆటను ఉగాది రోజు యువత నిర్వహించడం ప్రత్యేకత. గోల్కొండ చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జడకొప్పులాటలో గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

జడకొప్పులాట ఆడుతున్న యువకులు

# విద్య, ఉపాధి నైపుణ్యాల పెంపునకు కార్పస్ ఫండ్

### పూర్వ విద్యార్థుల వినూత్న ఆలోచన

రఘునాథపల్లి, మార్చి 30: మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వినూత్న ఆలోచన చేశారు. సొంత గ్రామంలోని విద్యార్థులకు విద్య, ఉపాధి పొందడంలో నైపుణ్యాల పెంపునకు తోడ్పాటు అందించేందుకు ప్రతినెలా రూ.20కి తగ్గకుండా కార్పస్ ఫండ్ జమ చేస్తున్నారు. ఖిలాషాపూర్ వరకే పరిమితం చేయకుండా రాష్ట్రం, జిల్లా, మండల స్థాయిలో విస్తరించేందుకు నడుం బిగించారు. ఆదివారం ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాల నుంచి మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ఎంఈఓకు మెమోరాండం అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థి, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, 5ఈ ఫౌండర్ కేశిపెద్ది నర్సింహరాజు ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా దేశానికి గొప్ప సందేశం వెళ్తుందని పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ల కృష్ణవేణి, మడుపోజు లక్ష్మినారాయణ, ఆలేటి యాదవరెడ్డి, సరాబు శ్రీనివాస్, కాయితాల రాజమౌళి, అంగీరేకుల సారయ్య, మీసాల సుధాకర్, ఉడుత రంజిత్ యాదవ్, గుగ్గిళ్ల రవి కుమార్ మస్సి చంద్రమౌళి, శాగ దేవరాజు, డ్యాగాల చంద్రశేఖర్, సురిగల భిక్షపతి, గుడి రాంరెడ్డి, గుజ్జుల చంద్ర శేఖర్, శాగ ఆంజనేయులు, పెంతల నాగరాజు, బాల్నె వెంకటేశ్వర్లు, కుసుంబ సరస్వతి, అల్లేపు అంజయ్య, హింగే భిక్షపతి, అల్లిబిల్లి కృష్ణ, ఉమ్మగోని మహేశ్, ముప్పిడి శ్రీధర్, పెంతల నాగరాజు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## సైనిక్ స్కూల్‌లో ధైవిక్‌కు సీటు

తరిగొప్పుల, మార్చి 30: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రుక్మాపూర్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన బానోత్ దైవిక్‌నాయక్ అర్హత సాధించాడు. తల్లిదండ్రులు బానోత్ మంజుల, అనిల్ కుమార్ ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

మల్లన్న ఆలయానికి బోనాలతో వెళ్తున్న రజక మహిళలు

## ఘనంగా మల్లన్న బోనాలు

లింగాలఘనపురం, మార్చి 30: మండల కేంద్రంలోని రజక కులస్తులు ఆదివారం మల్లన్నకు ఘనంగా బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రజకులు బైరోని బావి వద్ద కొన్నేళ్ల క్రితం మల్లన్న గుడి కట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని పూజలు చేస్తున్నారు. ఏటా ఉగాది రోజు రజకులు బోనాలతో వెళ్లి స్వామికి సమర్పించి, మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం బోనాలు సమర్పించి, పిల్లాపాపలను, గొడ్డూ గోదను సల్లంగ చూసి, ఎవుసం, వృత్తి, వ్యాపారం అభివృద్ధి చెందేలా దీవించు స్వామీ అంటూ వేడుకున్నారు. ఏదునూరి యాదగిరి, ఏదునూరి వీరన్న, సోమనర్సయ్య, అంజయ్య, శ్రీశైలం, పద్మ, పుష్పమ్మ, రేణుక పాల్గొన్నారు.

# ఘనంగా ఉగాది వేడుకలు

- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- హాజరైననాయకులు, ప్రజలు

నమస్తే నెట్‌వర్క్, మార్చి 30: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విశ్వవసు నామ సంవత్సరాది సందర్భంగా ఇంటింటా మామిడి తోరణాలు కట్టి, కొత్త కుండలో షడ్రుచులతో కూడిన పచ్చడి తయారు చేసి ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉగాది పచ్చడి తాగారు. బక్షాలు ఆరగించారు. ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ పఠన కార్యక్రమాల్లో రాశి ఫలాలను తెలుసుకున్నారు. జనగామ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం)లో చైర్మన్ రామిని రాజేశ్వర్ అధ్యక్షతన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్రగుప్తా, కోశాధికారి అయిత శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ గంగారబోయిన మల్లేశ్ పాల్గొన్నారు. వనితా క్లబ్ గ్రేటర్, వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్‌ల అధ్యక్షులు మాధవంశెట్టి వరూధిని, పదకంటి రవీందర్, కార్యదర్శి గట్టు రాధాకృష్ణ, కొకోటి రామారావు, గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, గన్ను నర్సింహులు, బేజుగం బిక్షపతి, అనూజ, కళావతి, నాగరాజు, ఉషా పాల్గొన్నారు. గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హనుమకొండలోని తన నివాసంలో ఉగాది వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దంపతులు

జనగామ పట్టణంలోని బాణాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కవులు, రచయితలు, ఉగాది కవి సమ్మేళనాలు వైభవంగా నిర్వహించి కవితా పఠనం, పద్యగానం చేశారు. గొల్లకురుమలు శ్రీమల్లికార్జునస్వామి బీరప్ప ఆలయానికి వెళ్లి బోనం సమర్పించారు. అక్కడే కొత్త పచ్చడి తయారు చేసి స్వామివారికి సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. పోచన్నపేట, బచ్చన్నపేటలో పురోహితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. నర్మెట మండలంలోని ఆలయాల్లో పురోహితులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం చేశారు. హన్మంతాపూర్‌లో మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ సర్పంచ్ పగడాల విజయ నర్సయ్య, వెల్దండలో మాజీ వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ వంగ రవి పాల్గొన్నారు. పాలకుర్తిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, హనుమండ్ల ఝాన్సీరెడ్డి ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి పంచారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలకు తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల్లో పండితులు, పూజారులు పంచాంగ పఠనం చేశారు. సుప్రసిద్ధ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జనగామ జడ్జి సందీప ప్రత్యేక పూజలు చేశారు. లింగాలఘనపురం ఆంజనేయస్వామి ఆలయ ఆలయంలో పంచాంగ శ్రవణంలో కారోబార్ బోయిని సురేశ్‌కుమార్, నాయకులు కేమిడి యాదగిరి, కవితావెంకటేశ్, ఎడ్ల రాజు, ఏదునూరి వీరన్న, కేమిడి భిక్షపతి, గవ్వల మల్లేశం, బృగుమమర్శి, బెజ్జం అంజనేయులు పాల్గొన్నారు. చిల్పూరులోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్ దంపతులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, దేవస్థానం డైరెక్టర్లు తాళ్లపెల్లి భిక్షపతి, రమేశ్, రాజశేఖర్, మాజీ సర్పంచ్ సమ్మయ్య పాల్గొన్నారు. తరిగొప్పులలో చెన్నకేశ, హనుమాన్ ఆలయాల్లో అర్చకులు పంచాగం చదివి వినిపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరు లింగం, అర్జుల సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు అర్జుల మధుసూదన్‌రెడ్డి, సిద్దిని మహిపాల్, ఏడేల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుంకరి యాదగిరి, మెర్గొజు సుధాకర్, పండుగ కనుకయ్య, మాశెట్టి శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, తాళ్లపల్లి రాజు, అర్జుల పోషిరెడ్డి, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. దేవరుప్పుల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వచ్చే నెల 16 నుంచి 20 వరకు జరిగే భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర గురించి అర్చకుడు వేంకటేశ్వరశర్మ వివరించారు. ఇదే సమయంలో బోడ్రాయి పండుగ ఉంటుందని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ తిరుమలనాథస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రాశీ ఫలాలు అడిగి తెలుసుకున్నారు. యాద శ్రీనివాస్, సరాబు ఆంజనేయులు, తెల్లాలకుల రామకృష్ణ, గన్ను శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గన్ను నర్సింహులు, నగేశ్, కొలిపాక సతీష్, చిలువేరు సత్యనారాయణ, పాలకుర్తి శ్రీనివాస్, పార్శి సురేష్ పాల్గొన్నారు.

వనిత క్లబ్ గ్రేటర్, వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



జనగామ రూరల్: సిద్దెంకిలో పచ్చడి పంపిణీ చేస్తున్న యాదవులు

స్టేషన్ ఘన్‌పూర్: తిరుమలనాథ ఆలయంలో పంచాంగ శ్రవణం

ఉగాది పచ్చడి తాగుతున్న ప్రతినిధులు నరేశ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి

## వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ

బచ్చన్నపేట, మార్చి 30 : మండల కేంద్రంలోని వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా పచ్చడి తయారు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి సూచన మేరకు సభ్యుడు ఆముదాల భూపాల్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సభ్యులు మహిపాల్‌రెడ్డి, కుమార్, శ్రీశైలం, సురేశ్, ప్రతీక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం

★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. Cont: VRN Developers & Builders-9700101918.

NTW-000

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.

NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565